క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



మోతీనగర్: మోతీనగర్ సీనియర్ సిటిజెన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ యస్. వి ప్రసాద్ వైద్యసేవలందించారు. బ్రహ్మానంద రెడ్డి, బిజుమళ్ల, నాగేశ్వరరావు, పుచ్చా శ్రీరామ మూర్తి, జగన్నాథం గౌడ్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్ వరకు బస్సు సౌకర్యం



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్, సఫ్దార్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వరకు ఆదివారం ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభమైంది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సబిహా బేగం, ముద్దం నరసింహా యాదవ్, మాజీ కార్పొరేటర్ తూమ శ్రావణ్‌కుమార్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, కూకట్‌పల్లి ఆర్టీసి డిపో మేనేజర్ ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టైలరింగ్ శిక్షణ



కూకట్‌పల్లి: మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన టైలరింగ్ శిక్షణ తరగతుల సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం కూకట్‌పల్లిలోని ఎస్‌ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిధిగా పాల్గొని శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన ఖార్డు సంస్థ ద్వారా ఎంతో మంది నిరుపేదలకు సేవ చేస్తున్న సుమన్ దంపతులను అభినందించారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛ భారత్‌లో భాగస్వాములు కావాలి



భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హైదర్‌నగర్ ప్రధాన రహదారిపై సమతా నగర్ పార్కు, భాగ్యనగర్‌కాలనీ బస్‌స్టాప్ వద్ద నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆదివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. అందరి సమిష్టి కృషితో బస్తీలు, కాలనీలు ఆదర్శవంతమైన, సుందరవనాలుగా తీర్చిదిద్దడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, నక్క శ్రీనివాస్, అష్రాఫ్ పాల్గొన్నారు.

వృద్ధులను ప్రభుత్వం ఆదుకోవాలి



మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనంలో ఆదివారం వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 75 సంవత్సరాలు నిండిన వారిని వి. చెన్న కేశవులు, ఈ. వెంకటేశ్వరరెడ్డి, జి.వి. రామనాథం, ఆర్. భగవంతరావులను అసోసియేషన్ అధ్యక్షుడు బి. మాణిక్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయో వృద్ధులు అనుభవజ్ఞులని, వారిని ప్రభుత్వం ఆదరించాలని కోరారు. సీనియర్ సిటిజన్ భవనం వల్ల వృద్ధులు అందరికీ కొత్త స్నేహితులు దొరికారని, నిత్యం వృద్ధులు అందరూ ఉదయం, సాయంత్రం భవనంలోకి వచ్చి కాలక్షేపం చేస్తూ ఉల్లాసంగా గడుపుతున్నారని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట బస్టాండ్ సమీపంలోని ఇందిరా గాంధీ విగ్రహం చౌరస్తాలో మ్యాన్ హోల్ ప్రమాదకరంగా మారింది. నిత్యం బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు తిరిగే ఈ చౌరస్తాలో గతంలో కూడా మ్యాన్ హోల్ మరమ్మత్తులు చేసారు. తిరిగి మళ్లీ పునరావృతం కావడం, ఈ చౌరస్తాలో భయపడుతూ వెళ్లాల్సి వస్తుంది. ఎటువంటి ప్రమాదం జరగక ముందే సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

చేయీ చేయీ కలిపి.. చెత్త తొలగించి..



చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న జోనల్ కమిషనర్ మమత..



నిజాంపేట్‌లో నర్సరీలో కలుపు తీస్తున్న మేయర్ నీలారెడ్డి..

నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా కాలనీలు, బస్తీల్లో జీహెచ్ఎంసి, సంక్షేమ సంఘాల, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పరిశుభ్రతా పనులు చేపట్టారు. కాలనీలోని పార్కులు, ఖాళీస్థలాలు, ప్రధాన రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించారు. జోనల్ కమిషనర్ మమత చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే పనిలో చేయి కలిపారు.



ఎస్ఆర్‌నాయక్‌నగర్‌లో..



జగద్గిరిగుట్ట సంజయ్‌పురి కాలనీలో..



దుండిగల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో..



సూరారం రామ్‌లీలా మైదానంలో కమిటీ ఆధ్వర్యంలో..



గాజులరామారం బాలయ్యనగర్ బస్తీలో..



సర్కిల్ ఉప కమిషనర్ నాగమణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తూ..



కొంపల్లిలో రోడ్లపై చెత్తను ఊడుస్తున్న కమిషనర్ శ్రీహరి..

కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ, వెంకటేశ్వర నగర్, హనుమాన్ నగర్, రిక్షాపుల్లర్స్ కాలనీ, బాగ్ అమీర్, శాంతినగర్, వెంకటేశ్వరనగర్, సప్తగిరి కాలనీ, కమలప్రసన్న నగర్ కాలనీల్లో 3 కోట్ల 46 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే కమ్యూనిటి హాలు నిర్మాణం, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, నాలా ప్రహరీగోడ, సీసీ కెమెరాల ఏర్పాటుకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ రోజాదేవి రంగారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, ఏరియా కమిటీ మెంబర్లు, ఉద్యమకారులు, అనుబంధ సంఘాల ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రాధాన్యం



కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయిస్తూ క్రీడాకారుల ప్రోత్సహిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపల్ పరిధి భౌరంపేట్‌లోని శ్రీరామ్ స్కేటింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించిన 15వ ఇంటర్ స్కూల్ స్కేటింగ్ కాంపిటీషన్ పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఇ రాజు ఇండియన్ ఫాసెస్ట్ స్కేటర్, ఏషియన్ మెడలిస్ట్ నిఖిలేష్ తబానేతో కలిసి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతే క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ప్రభుత్వ పరంగా అనేక ప్రోత్సహకాలు, ఉద్యోగవకాశాలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పలువురు క్రీడాకారులకు ఆయన ప్రశంస పత్రాలు, మెడల్స్ అందజేశారు.

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు శంబీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేయగా ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు.

అభివృద్ధిని విస్మరించిన గత ప్రభుత్వాలు

కుత్బుల్లాపూర్: గత ప్రభుత్వాలు కాలనీలు, బస్తీల అబివృద్ధిని విస్మరించాయని, నేడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి నోచుకుంటున్నాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం సుభాష్‌నగర్ డివిజన్‌లో ప్రగతియాత్ర చేపట్టిన ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. భాగ్యలక్ష్మి కాలనీలో రూ.51.6 లక్షలతో సీసీ రోడ్డు. లిటిల్ స్టార్ స్కూల్ రోడ్డులో రూ. 28 లక్షలతో, భగత్‌సింగ్‌నగర్‌లో రూ.48.8 లక్షలు, అల్లూరి సీతారామరాజునగర్‌లో రూ.31 లక్షలు, రాజీవ్‌గృహకల్పలో రూ.71.2 లక్షలు, శివసాయినగర్‌లో రూ.45.5 లక్షలు, జైబీమ్‌నగర్‌లో రూ.15 లక్షలతో, జీవన్‌జ్యోతినగర్‌లో రూ.54.5 లక్షలు, సూరారం కాలనీలో రూ. 34 లక్షలు, భవానీనగర్‌లో రూ.35 లక్షలు, రామిరెడ్డినగర్‌లో రూ.87 లక్షలు, ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో రూ.31 లక్షలు, సుందర్‌నగర్‌లో రూ.18.5 లక్షలు, జైసంతోష్‌నగర్‌లో రూ.34 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీలో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీలు, బస్తీల సంక్షేమసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్–ఉన్–నబీ

ఓల్డ్‌బోయిన్‌పల్లి: మిలాద్-ఉన్-నబీ పర్వదిన వేడుకలను ఓల్డ్ బోయిన్‌పల్లిలోని వివిధప్రాంతాలలో ముస్లింలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మసీదులకు రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా జల్సాలో భాగంగా ర్యాలీలను నిర్వహించారు. ఆయా ప్రాంతాలలో తిరుగుతూ మహ్మద్ ప్రవక్త సిద్ధాంతాలను ఈ ర్యాలీలో తెలియజేశారు. ఈ సందర్భంగా హస్మత్‌పేట బడే మజీద్ దగ్గర ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చెప్పిన సిద్ధాంతాలను తూచా తప్పకుండా పాటించే విధంగా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్ నాయకులు నరేందర్‌గౌడ్, కర్రె జంగయ్య, సయ్యద్ ఎజాజ్, గౌసద్దీన్, డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షుడు ఇర్ఫాన్, మేకల హరినాథ్, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.





మిలాద్-ఉన్-నబీ జల్సా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ, ప్రగతినగర్, హనుమాన్ నగర్, దీనబంధు కాలనీల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. 97 లక్షలతో కూడిన అభివృద్ధి పనులకు, 75 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా 22 లక్షలతో ఓపెన్ జిమ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం వెంకటేశ్వరరావు, వాటర్‌వర్క్స్ మేనేజర్ ప్రియాంక, వర్కు ఇన్‌స్పెక్టర్ సూర్య, కాలనీ వాసులు, డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు...



ఆల్విన్‌కాలనీ: సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని ఈ సేవా గ్రౌండ్‌లో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డినగర్, ప్రగతినగర్ కాలనీ వాసులు ఈ పరీక్షలు నిర్వహించుకున్నారు. సుమారు 600 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలను పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ భిక్షపతి యాదవ్, భూపాల్‌రెడ్డి, పర్వతాలు యాదవ్ పాల్గొన్నారు.

దైవ మార్గం చూపిన విశ్వ ప్రవక్త మహమ్మద్ ప్రవక్త

బాలానగర్: నమాజ్, రోజా జకాత్, హజ్ వంటివి ఖచ్చితంగా పాటిస్తూ మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గమే రాజమార్గమని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఆదివారం శోభన కాలనీ, గౌతమ్ నగర్‌లో ముస్లిం సోదరులు పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కార్పొరేటర్ సతీష్‌గౌడ్ హాజరై అన్నవితరణ కార్యక్రమాన్ని ప్రారంభించరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి మీదకి దేవుడు పంపించిన చివరి ప్రవక్త మహమ్మద్ ప్రవక్త అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లీం సోదరులు మహమ్మద్ సలావుద్దీన్, ఇస్మాయిల్, లతీఫ్, తాజుద్దీన్, షేక్ కరీం, మహమ్మద్ ఇక్రాముద్దీన్, బీఆర్‌యస్ నాయకులు రవీంద్రనాథ్ గౌడ్, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ కార్యక్రమం వాయిదా

కూకట్‌పల్లి: అనివార్య కారణాల వల్ల మంత్రి కేటీఆర్ ముఖ్య అతిధిగా విచ్చేస్తున్న సందర్భంగా జరిగే కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రగతి నివేదన సభ అక్టోబర్ 3 నుంచి 5వ తేది 4 గంటలకి మార్చినట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, ప్రజలు అందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

బబ్బుగూడ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛ భారత్



కార్యక్రమంలో పాల్గొన్న పన్నాల హరీష్ రెడ్డి, మహేందర్ తదితరులు



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న ఓబీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ తదితరులు

మోతీనగర్: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పిలుపు మేరకు 10 గంటలకు సేవా కార్యక్రమంలో భాగంగా బబ్బుగూడ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడడ్డి, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, డివిజన్ ఏఎంసి ఉమాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ చేపట్టే వారమని ప్రధాని పిలుపు మేరకు 1వ తారీఖునే ఒక గంట పాటు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. బబ్బుగూడలోని ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులు దుమ్ము పట్టి ఉన్నాయని వాటన్నిటిని శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

జేఎన్‌టీయూహెచ్‌లో స్వచ్ఛ సేవా కార్యక్రమం



స్వచ్ఛ సేవా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది

బాలానగర్: గాంధీ జయంతిని పురస్కరించుకొని జేఎన్‌టియు క్యాంపస్‌లో ఆదివారం విసి డా. కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ డా. గోవర్ధన్, రిజిస్ట్రార్ డా. మంజూర్ హుసేన్, అన్ని విభాగాల ఉద్యోగులు , సిబ్బంది స్వచ్ఛ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ కట్టా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ మనం ఆరోగ్యకర జీవనం గడపాలంటే పరిసరాలను శుభ్రం చేసుకోవటం ఎంతో అవసరం అన్నారు. ప్రతి ఒక్కరు ఇళ్లు, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యవంతమైన జీవనం గడపాలన్నారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు క్యాంపస్‌లో పరిసరాలను శుభ్రం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ డా. జీ.వి. నర్సింహారెడ్డి, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. సైదా నాయక్, డా. పి. ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ....

కేంద్ర గిడ్డంగుల సంస్థ, కంటైనర్ ఫ్రయిట్ స్టేషన్, కూకట్‌పల్లిలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఉదయం 10 గంటలకు 1 గంట పాటు నిర్వహించారు.

వరదనీటి సమస్యను పరిష్కరించండి

నిజాంపేట్: వర్షపునీరు సాఫీగా వెళ్లే విధంగా వరద నీటి కాలువలను నిర్మించడం జరిగిందని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ 2వ డివిజన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ కాలనీ, ఆర్‌కే లేఅవుట్, చందు లేఅవుట్ సంక్షేమ సంఘం సభ్యులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతంలో వర్షాలు పడ్డ ప్రతిసారి వరదనీరు వచ్చి చేరుతోందని, దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమల బెడద ఎక్కువైందని, సమస్య పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. స్పందిస్తూ ఇప్పటికే పలు ప్రాంతాల్లో నాలా నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, వరదనీరు సాఫీగా వెళ్లేగా స్ట్రామ్ డ్రైయిన్‌లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.




మేయర్ నీలారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీల అసోసియేషన్ సభ్యులు

జాతీయ రహదారిపై ట్రాఫిక్ టెర్రర్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రాంతంలో గత రెండు రోజులుగా ట్రాఫిక్ స్తంభించి కూకట్‌పల్లి రహదారులన్నీ మూసుకుపోయాయి. ఒకవైపు హైటెక్‌సిటీ నుంచి జేఎన్‌టీయు వైపు వచ్చే వాహనాలు సుమారు ఐదు కిలోమీటర్ల మేర వరకు స్తంభించి పోయాయి. ఇటీవల ప్రారంభమైన ఓ షాపింగ్ మాల్‌కు ప్రజలు పెద్ద ఎత్తున పోటెత్తడంతో పాటు వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేశారు. దీంతో అక్కడ ట్రాఫిక్ వ్యవస్థ కంట్రోల్ లేకుండా పోయింది. మరోవైపు జేఎన్‌టీయూ నుంచి భరత్‌నగర్ వరకు ట్రాఫిక్ స్తంభించి రెండు కిలోమీటర్లకు రెండు గంటల ప్రయాణం సమయం తీసుకుంది. దీంతో వాహనదారులు రోడ్లపై చిర్రెత్తిపోతున్నారు. ఇదిలా వుండగా ఆదివారం సెలవు రోజు కావటంతో చాలా మంది రోడ్లపైకి వచ్చారు. కూకట్‌పల్లి ప్రాంతంలో పార్కింగ్ కోసం ప్రత్యేకమైన స్థలాలు లేకపోవడంతో వాహనదారులు రోడ్లపైనే పార్కింగ్ చేయటం మూలంగా రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి. ఇది ఇలా ఉండగా అంతర్గత రహదారుల్లో కూడా వాహనాలు నిండిపోయి ఉండడంతో ప్రతి చౌరస్తాలో కూడా ట్రాఫిక్ స్తంభించి పోయింది. కూకట్‌పల్లిలోని కేపీహెచ్‌బీ కాలనీ, భాగ్యనగర్‌కాలనీ, వివేకానందనగర్ కాలనీ, ఆల్విన్‌కాలనీ, హెచ్ఎంటి శాతవాహన నగర్ కాలనీ, వసంత నగర్, ప్రగతి నగర్ రోడ్డు, నిజాంపేట చౌరస్తా తదితర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం 3 నుంచి 7 గంటల వరకు రోడ్లపై వాహనాలు కిలోమీటర్ల దూరం నిలిచిపోయాయి. కూకట్‌పల్లిలో ఇప్పటికే ఐదు ఫ్లై ఓవర్లు వేసినప్పటికీ మెట్రో రైలు నడుస్తున్నప్పటికీ ట్రాఫిక్ అంతరాయంలో ఏ మాత్రం మార్పు రాలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.





కూకట్‌పల్లి జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు